డైతే పాపం చచ్చిపోయాడని అంతా ఓ చెయ్యివేస్తే వారం రోజుల్లో ప్రభుత్వం నుంచి రావలసిన మొత్తం సొమ్ము నా సంసారానికి వస్తుంది. తద్వారా పిల్ల పెళ్ళవుతుంది.

ఒక సంసారానికి ఒక ఉద్యోగం, ఒక ఆడపిల్ల పెళ్లీ సంప్రాప్తించటానికి ఒక మరణం ఈరోజుల్లో ఏమంత గొప్ప పణం కాదు.

చివరగా, నా భార్య ఒకరిమీద ఆధారపడవలసిన పని లేకుండా ఫ్యామిలీ పెన్షన్ రూపేణా ఆవిడ బతికున్నంత కాలం కొంత మొత్తం వస్తుంది.

ఒకవేళ నేను రిటైరై ఏ గ్రహపాటునో మరణించినా వీరికెవ్వరికీ ఎటువంటి లాభమూ వుండదు. అందుకే ఈ నిర్ణయాన్ని తీసుకున్నాను. కొడుకుకి ఉద్యోగం, కూతురికి పెళ్ళి, భార్యకు జీవితాంతం ఆధారం- ఒక్క నా పనికిరాని మరణం వల్ల ఎన్ని ఉపయోగాలో చూడు. నేనీ ఆలోచనతో ఇలా చేశానని నా భార్యాబిడ్డలకు ఎట్టి పరిస్థితిలోనూ చెప్పవద్దు. ఇది నా తుది శాసనంగా భావించుకో'

మిత్రుడి ఉత్తరం చదివిన సుబ్బారావుకి కళ్ళు చెమర్చాయి.

-బద్దిగం పాండురంగారెడ్డి
(జగిత్యాల)

# మేరా భారత్ మహాన్

పాకిస్తాన్ జైళ్ళలో 19 ఏళ్ళు కఠిన కారాగార శిక్ష అనుభవించి విడుదలై, స్వదేశానికి తిరిగొచ్చిన సిపాయి అతను. కాకినాడ నుండి కాశ్మీరు బోర్డరుకెళ్ళి బిఎస్ఎఫ్‌లో పనిచేస్తున్నప్పుడు విధి వక్రించి పాకిస్తాన్‌కి బందీగా దొరికిపోయిన విధి వంచితుడతను. రెండేళ్ళ వైవాహిక జీవితానికి ఫలితంగా ఏడాది కూతుర్ని భార్య చేతుల్లో వదిలివెళ్ళాడు. బాహ్య ప్రపంచానికి దూరంగా, ప్రత్యేక జైళ్ళలో ఎక్కడున్నదీ తెలియని చీకటి కారాగారాల్లో మగ్గి, విడుదలై భారతదేశపు పొలిమేరల్లో కాలు మోపగానే చుట్టుముట్టిన సైనిక సోదరులంతా అతని ఆకారాన్ని చూసి, ప్రశ్నల వర్షం కురిపించారు. అందరి ప్రశ్నా ఒక్కటే 'ఎంతగా చిత్రవధలు పెట్టార'ని. అలా అడుగుతూనే అక్కడున్న మిలిట్రీ క్యాంపుకి రాజ మర్యాదలతో తీసుకెళ్ళారు.



అక్కడున్న వాళ్ళందర్నీ పరికించి చూశాడతను. తనకు పరిచయమున్న వాళ్ళెవరూ లేరక్కడ.

వాళ్ళు మళ్ళీ ప్రశ్నించడం మొదలెట్టారు.

ఏమని చెప్పగలడు? ఎన్నని చెప్పగలడు?

మరుగుతున్న వేణ్ణీళ్ళు మొహం మీద వేగంగా విసరగా, మొహమంతా బొబ్బలెక్కి, అవి మానేసరికి చర్మమంతా రబ్బరు సాగదీసినట్టు సాగి, తన ఆకారాన్ని వికారంగా మార్చేసిన దుర్ఘటన చెప్పి, తల పక్కకి తిప్పి చెవుల కింద మెత్తటి తమ్మెలను కత్తితో కసాయితనంగా కోసిన సంఘటన చెబుతుంటే...

అక్కడున్న వాళ్ళలో ఒకతను ఉండబట్టలేక ''ఇంత దారుణంగా హింసిస్తుంటే ఎలా భరించగలిగారు?'' అనంటే

''మాతృభూమి రక్షణ కోసం దేహం మీద తేలుతున్న గాయాల్ని భరిస్తున్నపుడు శరీరానికి బాధ కలిగేదే తప్ప, మనసుకి ఏనాడూ వేదన కలగలేదు'' అనతడు నవ్వుతూ చెబుతూంటే, నోటిలో ముందువరస పళ్ళేవీ కన్పించలేదుగానీ, అతని కళ్ళనుండి ఆనందాశ్రువులు రాలడం అక్కడున్న వాళ్ళందర్నీ కదిలించింది.

సైనిక సోదరులంతా ''మేరా భారత్ మహాన్'' అంటూ అతన్ని ఆకాశానికెత్తినంత పనిచేశారు.

సైనిక సోదరుల ఘన సన్మానాన్ని అందుకుని, రెండ్రోజుల రైలు ప్రయాణం చేసి, కాకినాడలో దిగి, తమ గ్రామానికెళ్ళే బస్సెక్కాడు. బస్ రద్దీగా ఉంది. తన సూట్‌కేసూ, బ్యాగూ పైన పెట్టి ఓ పక్కగా నుంచున్నాడు.

బస్‌లో ప్యాసింజర్లు ఎక్కువై ఒకళ్ళనొకళ్ళు నెట్టుకుంటుంటే ''కాస్త జరగండి'' అన్నాడతను తన మీద వాలిపోతున్న వ్యక్తితో.

''నువ్వే కాస్త వెనక్కెళ్ళవయ్యా బాబూ! నీ చెమట కంపు కడుపులో తిప్పుతోంది'' అన్నాడు సీట్లో కూర్చున్న ఓ యువకుడు.

క్షణం పాటు మనసు చివుక్కుమందతనికి.

ఇన్నేళ్ళూ అజ్ఞాతంగా తన దేహం దేశం కోసం కార్చిన స్వేదం, ఇవ్వాళ జనజీవనంలో అనాఘ్రాణితమౌతోందన్న ఊహ తనకు రానందుకు నవ్వుకున్నాడు.

బస్సు భారంగా కదిలింది. కిటికీ నుండి వీస్తున్న చల్లని గాలి బహిర్ స్వేదాన్నీ, అంతర్వేదన్నీ స్వాంత పరుస్తున్నట్టనిపించింది. తను పుట్టి పెరిగిన ఊరుని, తన వాళ్ళని చూడబోతున్న ఆనందం, కిక్కిరిసిన జనం మధ్యలో నిలబడ్డ అతని కాళ్ళకి నెప్పి తెలియనంతగా మనసులో సుఖాశీనమైంది. గంటన్నర తర్వాత అతను దిగాల్సిన ఊరులో బస్సు ప్రవేశించింది. అప్పటి ఆనవాళ్ళు ఎదురుమదురుగా కనిపించాయి.

సెంటర్లో బస్సు ఆగగానే సూట్కేసూ, బ్యాగూ తీసుకుని బస్సు దిగాడతను. కండక్టరిచ్చిన చిల్లర జేబులో వేసుకుందామని చెయ్యిపెట్టేసరికి, ప్యాంటుకి జేబులేదు. అందులో ఉన్న పర్సూ లేదు. ఆశ్చర్యపోయాడు. బస్‌లో ఎవరో బ్లేడుతో అతని శరీరంపై గాయం పడకుండా జేబు కత్తిరించి పర్సు కొట్టేశారు.

అనుమానంతో సూట్కేసు తాళం చూసుకుని, బ్యాగువైపు చూశాడు. జిప్ పక్కన పొడవుగా కత్తిరించి ఉంది. గబగబా బ్యాగులో ఉన్న బట్టలన్నీ బయటికి తీసి, ఎంత వెతికినా కన్పించని 'ఆ వస్తువు' కోసం అతని మనసు విలవిల్లాడింది.

పరాయి దేశంలో శరీరంపై పడ్డ గాయాల్ని సంవత్సరాల తరబడీ అనుభవించిన అతన్ని ఈ సంఘటన మానసికంగా తీవ్రంగా గాయపరిచింది.

అది ఇరవై ఏళ్ళుగా తను చూడని కన్నకూతురి కోసం ఢిల్లీలో కొన్న బంగారు గాజులున్న కవరు దొంగల పాలవటం తట్టుకోలేక ప్రయత్నంగానే అతను 'మేరా భారత్ మహాన్' అని అందరికీ విన్పించేలా అంటుంటే, వింతగా చూడసాగారక్కడున్న వాళ్ళంతా.

-ఎం.వెంకటేశ్వరరావు
(సికింద్రాబాద్)